అధ్వాన రోడ్లతో అవస్థలు



ఈదుపురం నుంచి కొఠారీ వెళ్లే రోడ్డు దుస్థితి

- గోతుల్లో నిలిచిన వర్షపు నీరు
- వాహనచోదకులకు తప్పని పాట్లు

ఇచ్ఛాపురం రూరల్/టెక్కలి/కాశీబుగ్గ: చినుకు పడితే చాలు గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. రోడ్లపై నీరు రోజుల తరబడి నిలిచిపోతుండటంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు పాలకులు గానీ, ఇటు అధికారులు గానీ రోడ్ల దుస్థితిని పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్ఛాపురం మండలంలోని ఈదుపురం–కొఠారీ, అరకబద్ర, ధర్మపురం–ఇన్నేశుపేట, సన్యాసిపుట్టుగ, టి.బరంపురం తదితర ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. టెక్కలి మండలానికి సంబంధించి టెక్కలి నుంచి చెట్లతాండ్ర వెళ్లే మార్గంలో ఎన్‌టీఆర్ కాలనీ వద్ద రోడ్డు పూర్తిగా గోతులుమయం కావడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్లు కావడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 8వ వార్డు నర్సిపురం–తాళ్లబద్ర గ్రామాల మధ్య మట్టి రోడ్డు కావడంతో వర్షపు నీరు నిలిచిపోతోంది. ఉద్దాన ప్రాంతానికి చెందిన వారంతా పలాస రైల్వేస్టేషన్‌కు రావాలంటే వెనుక భాగంలో ఉన్న ఈ రోడ్డే అనుకూలం. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



టెక్కలి - చెట్లతాండ్ర మార్గంలో ఎన్‌టీఆర్ కాలనీ వద్ద రోడ్డుపై ఏర్పడిన గోతులు



అరకబద్ర గ్రామానికి వెళ్లే గ్రామీణ రహదారి



తాళ్లబద్ర-నర్సిపురం మధ్య రోడ్డు పరిస్థితి

ప్రభుత్వ భూమి కబ్జా!



ఆక్రమించిన భూమిలో నీలగిరి మొక్కలు నాటిన దృశ్యం

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర గ్రామ సచివాలయాన్ని ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 250లో సుమారు 40 సెంట్ల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన గుడ్ల వైకుంఠరావు ఆక్రమించుకున్నాడని అదే గ్రామానికి చెందిన చెందిన చింతాడ చిన్నారావు ఇటీవల తహసీల్దార్, కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. సచివాలయానికి సంబంధించిన ఉపాధి హామీ నేమ్ బోర్డును విరగ్గొట్టి అధికార పార్టీ అండదండలతో ఆక్రమించిన స్థలంలో నీలగిరి మొక్కలను నాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, గ్రామ సచివాలయ ఉద్యోగులు పట్టించుకోవడం లేదని, ఆక్రమించిన భూమి సుమారు కోటి రూపాయలు ఉంటుందని తెలిపారు. తక్షణమే భూమిలో ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రేపు టెక్కలిలో ప్రక్షాళన పూజలు

టెక్కలి: తిరుమల తిరుపతి లడ్డూను సీఎం చంద్రబాబు అపవిత్రం చేయడంపై శనివారం టెక్కలి వైఎస్సార్ జంక్షన్ సమీపంలో పట్టుమహాదేవి కోనేరు గట్టుపై గల వైభవ వేంకటేశ్వర ఆలయంలో ప్రక్షాళన పూజలు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ గురువారం పిలుపునిచ్చారు.

పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి నాలుగు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టెక్కలి: టెక్కలి టౌన్ -4 పరిధిలోని ఆదిఆంధ్రా వీధి, బ్రాహ్మణవీధి, మెట్టవీధి, మండాపాలం కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ జీ.శంకర్రావు ఒక ప్రకటనలో తెలిపారు.

సోంపేట: కొర్లాం సబ్‌స్టేషన్ పరిధిలోని మామిడిపల్లి, టి.శాసనాం, గొల్లూరు, ఉప్పలాం, సిరిమామిడి, ఎర్రముక్కాం, రాణిగాం, బట్టిగళ్లూరు, కొత్తరాజాం, అనంతపురం తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.యోగేశ్వరరావు తెలిపారు.

ఇచ్ఛాపురం రూరల్: మండల పరిధిలోని ఎం.తోటూరుచ రత్తకన్న, మండపల్లి, మశాకపురం, జగన్నాధపురం గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు.

కాశీబుగ్గ: పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని లక్ష్మిపురం, కృష్ణాపురం, పి.జె.పురం, గరుడఖండి, గోపాలపురం, సరియాపల్లి, మహదేవపురం, వజ్రపుకొత్తూరు, బట్టుపాడు, అనంతగిరి, వెంకటాపురం తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పలాస ఈఆర్‌ఓ కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది.

ఘనంగా వెంకటరావు దొర జన్మదిన వేడుకలు



పుట్టినరోజు వేడుకల్లో సీదిరి అప్పలరాజు, నాయకులు

కాశీబుగ్గ: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, నారాయణదొర విద్యా సంస్థల చైర్మన్ హనుమంతు వెంకటరావుదొర జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సనపల సింహాచలం, తమ్మినేని శ్రావణి శాంతారావు, ఉంగ సాయికృష్ణ, పీకే శ్రీనువాసరావు, పైల వెంకటరావు, శిష్టు గోపి, బిడి రావు, మొదలవలస మన్మథరావు, గండేటి జోగారావు, పైల కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉపాధ్యాయ సంఘ నాయకుడిగా, ఉత్తమ బోధనలు అందించిన టీచర్‌గా కొర్ల టంకోధర్ చిరస్మరణీయ సేవలు అందించారని, ఆయన మృతి తీరని లోటని వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తారకేశ్వర్ పండా కొనియాడారు. గురువారం సంతాప కార్యక్రమం నిర్వహించి టంకోధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పి.గజేంద్ర, సుభాష్, శ్రీరాములు, కె.జయరాం, కె.వెంకటరావు, టి.భోజరాజు తదితరులు పాల్గొన్నారు.

● ఆకట్టుకున్న తప్పెటగుళ్ల ప్రదర్శన



చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరుగుతున్న ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో పలాస మండలం రేగులపాడుకు చెందిన తప్పెటగుళ్ల బృందం అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. పీత గంగయ్య ఆధ్వర్యంలో కళాకారులను ఆలయ ఈఓ గురుప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. - కాశీబుగ్గ

కొత్తమ్మతల్లి జాతరకు జిల్లా జడ్జికి ఆహ్వానం



ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఈఓ

కోటబొమ్మాళి: అక్టోబర్ 1 నుంచి 3 వరకూ కోటబొమ్మాళిలో జరగనున్న కొత్తమ్మతల్లి జాతరకు హాజరుకావాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానాకు ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ గురువారం ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ మేరకు జడ్జి చాంబర్‌లో కలిసి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు కె.అచ్చెన్నాయుడు, మంచాల వెంకటరావు, దేవాది కృష్ణారావు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర వెనుకబాటుకు పాలకులే కారణం



సమావేశంలో మాట్లాడుతున్న వంకల మాధవరావు

పలాస: ఉత్తరాంధ్ర వెనుకబాటుకు పాలకులే కారణమని సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు చెప్పారు. పలాసలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 29న టెక్కలి అంబేడ్కర్ భవన్‌లో ఉత్తరాంధ్ర సమస్యలు–పరిష్కార మార్గాలు అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నామని, అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఐ.ఎఫ్.టి.యు.జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, పి.డి.ఎస్.యు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్, మామిడి భీమారావు, సార్ల రామారావు, భంగ్లా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్డు



కొట్టుకుపోయిన రోడ్డు

వజ్రపుకొత్తూరు రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బెండి–మంచినీళ్లపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు కొండపూరు–పల్లివూరు జంక్షన్ వద్ద కోతకు గురైంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పారాలీగల్ సెల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

కవిటి/ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు పరిధిలోని కవిటి, ఇచ్ఛాపురం మండలాల పరిధిలో పారా లీగల్ వలంటీర్లుగా పని చేసేందుకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ పరీక్షకుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఇచ్ఛాపురం రూరల్, కవిటి మండలాలలో ఆసక్తి కలిగి, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇచ్ఛాపురం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంలో అక్టోబర్ 8లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి కోర్టు నుంచి ఎటువంటి జీతం ఇవ్వబడదని, స్వచ్ఛందంగా పనిచేయాల్సి ఉంటుందని, వివరాలకు 7893002368 నంబరును సంప్రదించాలని సూచించారు.

కూటమి బాధితులకు అండగా ఉంటాం



నీలకంఠేశ్వరరావు కుటుంబానికి భరోసా కల్పిస్తున్న పేరాడ తిలక్, నాయకులు

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సామాన్య ప్రజలపై విచక్షణ రహితంగా దాడులు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని, బాధితులందరికీ అండగా ఉంటూ పార్టీ తరఫున న్యాయ పోరాటం చేస్తామని వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ భరోసా నిచ్చారు.

టెక్కలి మండలం తిర్లంగిలో ఇటీవల అక్రమ నిర్మాణం పేరుతో గ్రామానికి చెందిన సాహుకారి నీలకంఠేశ్వరరావుకు చెందిన ఇంటిని కూల్చివేశారు. విషయం తెలుసుకున్న తిలక్, నాయకులు గురువారం తిర్లంగి వెళ్లి బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో ఎందుకు ఈ ప్రభుత్వానికి ఓట్లు వేశామా అంటూ ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. నీలకంఠేశ్వర్రావుకు చెందిన ఇంటి నిర్మాణం అక్రమం అని అధికారులు, గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని, అదే వ్యక్తికి గత ప్రభుత్వంలో అధికారులు సంపూర్ణ గృహ హక్కు పథకం కింద హక్కు కల్పించారని గుర్తు చేశారు. అధికారులు సైతం కూటమి నాయకుల చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు సత్తారు సత్యం, ఎస్.కృష్ణ, బి.రాజేష్, బి.బలుసు, ఎస్.తేజేశ్వర్రావు, జి.మోహన్‌రెడ్డి, టి.జగ్గారావు, ఎస్.ప్రసాద్, సత్తిబాబు, అడవిరాజు, ఎస్.బైరాగి, డి.శంకర్, ఎం.నాగేశ్వరరావు, రాజులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సంఘం ఏర్పాటు



నూతన కార్యవర్గ సభ్యులు

కవిటి: స్థానిక చింతామణి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గురువారం కవిటి మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నూతన సంఘం ఏర్పాటైంది. ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎస్సీ వర్గీకరణ పోరాట సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సంఘంలో అధ్యక్షునిగా బాగ వేణు, ప్రధాన కార్యదర్శిగా మద్దిలి కేశవరావు, ఉపాధ్యక్షులుగా జడ్డిడి లింగరాజు, బలగ ధర్మారావు, పందిరి కేశవరావు, పాటి కుమార్, సహాయ కార్యదర్శులుగా దడ్డ ధర్మారావు, మురిడి సుధాకర్, దుండంగి జీవన్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. గౌరవ అధ్యక్షులుగా దుండంగి వాసు, గౌరవ సలహాదారులుగా దీపాల జగన్నాయకులు, బాగ నందేశ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సల్ల దేవరాజు, పందిరి లోకేష్, ఉపాధ్యక్షులు డొప్ప వెంకటరావు, నూతలపాటి బాబూరావు, కన్వీనర్ బుస్కల ఈశ్వరరావు, వంకిల కేశవరావు, కొప్పల హేమంత్, కొక్కిరి రాజు, రవి, సంఘ నాయకులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేస్తాం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

వజ్రపుకొత్తూరు రూరల్/కవిటి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామని, దీనికి కొంత సమయం పడుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు,రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో గురువారం మాజీ సర్పంచ్ గుల్ల చిన్నారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గౌతు శిరీష అధ్యక్షతన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీపావళి నుంచి మహిళలకు 3 ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తామన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దుర్గారావు, మాజీ ఎంపీపీ జి.వసంతరావు, పీరుకట్ల విఠల్, మండల అధ్యక్షుడు సూరాడ మోహన్‌రావు, జి.చిన్నారావు, జి.పాపారావు, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి ప్రజలకు అన్ని పథకాల్ని అందిస్తామని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. గురువారం కవిటి పట్టణంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మురళీమోహన్‌రావు, ఎంపీడీఓ సూర్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



తులసిప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని నందిగాం మండలం లఖిదాసుపురం హైస్కూల్ హెచ్ఎం చిలుకు కృష్ణారావు అన్నారు. పాఠశాలలో గురువారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సైన్స్ ఉపాధ్యాయుడు తులసిప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మాదిన లోకనాథం, స్కూల్ కమిటీ చైర్మన్ ఎం.సీతారాం, ఉపాధ్యాయులు ఆర్.రామారావు, బి.రత్నం, దుంపా శ్రీనివాస్, గోవిందరావు, ప్రియదర్శిని, త్రినాథ్ పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు కృషి



మాట్లాడుతున్న ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మలయాద్రి

కాశీబుగ్గ: బాలల సంరక్షణకు కృషి చేస్తున్నట్లు చైల్డ్ హెల్ప్‌డెస్క్ సూపర్‌వైజర్ బాల సరస్వతి తెలిపారు. పలాస రైల్వేస్టేషన్‌లో గురువారం చైల్డ్ హెల్ప్ డెస్క్, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మలయాద్రి ఆధ్వర్యంలో రైలు ప్రయాణికులకు 139, 1098 సేవలపై అవగాహన కల్పించారు.

బాబా జయంతి వేడుకలు రేపు

టెక్కలి: టెక్కలి శంభానవీధిలోని ద్వారకా షిర్డీ సాయి మందిరంలో శనివారం సత్యసాయిబాబా జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త వాకాడ నారాయణరెడ్డి, అర్చకుడు మురపాక రమేష్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఇచ్ఛాపురం రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖాధికారులు హాజరు కావాలని కోరారు.

40 లీటర్ల సారా పట్టివేత

కంచిలి: మండలంలోని జక్కర గ్రామం వద్ద ఒడిశా నుంచి ద్విచక్ర వాహనంపై నాటుసారాను తీసుకొస్తుండగా కంచిలి పోలీసులు గురువారం పట్టుకున్నారు. జక్కర గ్రామానికి చెందిన దయగల అనిల్ ఓ ప్లాస్టిక్ యూరియా బ్యాగ్‌లో 20 లీటర్ల చొప్పున రెండు బెలూన్స్‌లో మొత్తం 40 లీటర్ల సారాను తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకొన్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎ.ఎస్.ఐ.రామచంద్రరావు తెలిపారు.

కౌమార దశలో జాగ్రత్తలు తప్పనిసరి

పలాస: విద్యార్థులు కౌమార దశలోనే తగు జాగ్రత్తలు తీసుకోవాలని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ రమణ చెప్పారు. పాఠశాలలో గురువారం గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ ఆధ్వర్యంలో బ్రైటర్ డేష్ అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ద్వారా విద్యార్థినులకు 300 శానిటరీ ప్యాడ్స్ అందించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ హిమజ, సైకాలజిస్టు ఆశాజ్యోతి, సంగీత, దామోదర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కోటబొమ్మాళి: స్థానిక ప్రకాష్‌నగర్‌కాలనీ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ లఖినేని విశ్వప్రతాప్ గురువారం తనిఖీ చేశారు. రికార్డులను, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్కవరంలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

టెక్కలి: టెక్కలి మండలం అక్కవరంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. లోటస్ ఐ కేర్ ఆధ్వర్యంలో సర్పంచ్ పొట్నూరు భూలక్ష్మి అప్పలనాయుడు నేతృత్వంలో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామస్తులు కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

కాశీబుగ్గ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు మొక్కలను పెంచుదాం–ప్రకృతిని కాపాడుదాం అనే కార్యక్రమంలో భాగంగా గురువారం చినబాడాం కోనేరు వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీరామనందస్వామి, నాయకులు వైశ్యరాజు మోహనరాజు, బడ్డ నాగరాజు, దానేటి పద్మజ, నర్తు రామారావు, సంతోష్‌కుమార్ పండా తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

సోంపేట: అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ అన్నారు. సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సోంపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, పరిపాలనాధికారి జి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బదిలీ ఉద్యోగికి సన్మానం



ప్రసాదరావు దంపతులను సత్కరిస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: సెర్ప్ ఏపీఎంగా విధులు నిర్వహిస్తూ కంచిలి మండలానికి బదిలీపై వెళ్లిన సనపల ప్రసాదరావును సిబ్బంది ఘనంగా సత్కరించారు. గురువారం ఇచ్ఛాపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు, వీఓఏలు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ కె.రామారావు, ఉపాధి ఏపీఓ పి.శ్రీనివాసరావులు ప్రసాదరావు దంపతులను దుశ్శాలువతో సత్కరించి వీడ్కోలు పలికారు.

వరద బాధితులకు సాయం



ఎమ్మెల్యేకు చెక్ అందిస్తున్న స్కూల్ ప్రతినిధులు

కాశీబుగ్గ : మున్సిపాలిటీ పరిధిలోని నర్సిపురంలో ఉన్న శ్రీసాయిశిరీషా హైస్కూల్ తరఫున విజయవాడ వరద బాధితులకు రూ.50 వేల సాయం ప్రకటించారు. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి చేరేలా చెక్‌ను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు గురువారం అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కవిటి భారతి, రేణుకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు శుభరాట



శుభరాట వేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: దుర్గాదేవి శరన్నవరాత్రులు సందర్భంగా ఈదుపురంలో బస్టాండ్ కూడలిలో గురువారం శుభరాట వేశారు. 22వ వార్షికోత్సవ నవరాత్రి పూజలు పురస్కరించుకొని సిద్ధాంతి నీలగిరి రామకృష్ణ మంత్రోచ్ఛారణల నడుమ ఎంపీటీసీ నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్ ఈ క్రతువు చేయించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు కొత్తపల్లి సంతోష్, అలఘరి రాము, బుంగ రాజు, గిరి, జగదీష్, గోపాల్, రాజేశ్, తరుణ్, అజయ్, కృష్ణ పాల్గొన్నారు.

చెస్ పోటీల విజేతకు అభినందనలు



కోట కల్పక్‌హరీష్ కేతన్

కాశీబుగ్గ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో పలాస మండలం రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్ విద్యార్థి కోట కల్పక్‌హరీష్ కేతన్ విజేతగా నిలిచాడు. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థికి కరస్పాండెంట్ మల్లా రామేశ్వరం, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి అభినందనలు తెలిపారు.

క్రీడాకారులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కంచిలి: కవిటి మండలం రాజపురంలో జరిగిన నియోజకవర్గస్థాయి కబడ్డీ, ఖోఖో పోటీల్లో కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.అఖిల, ఎస్.సాయి దివాకర్, ఎం.గురునాథ్, ఎన్.భగవాన్‌లు రాణించి జిల్లాస్థాయి పోటీలకు ఆడేందుకు అర్హత సాధించారు. వీరు శుక్రవారం జిల్లా కేంద్రంలో జరగబోయే పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం సీతారాంనాయుడు, పీడీ రోజారమణి, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న సీఐ మంగరాజు

కంచిలి: సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సోంపేట సీఐ బి.మంగరాజు అన్నారు. కంచిలి రైల్వేస్టేషన్ ఆవరణలో గురువారం సైబర్ నేరాల తీరుపై స్థానికులకు అవగాహన కల్పించారు. లోన్ యాప్స్, ఇతర మోసాలకు దారితీస్తున్న పరిస్థితులను వివరించారు. వీటి బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

30న మున్సిపల్ సమావేశం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.